# అబల

శారీరకమైన లోపం ధార్మికుల సానుభూతిని పొందే టందు కొకరకం యోగ్యతాపత్రంవంటిది!

ఆమె...

గ్రుడ్డిది కాదు,

కుంటిది కాదు,

జబ్బుది కాదు,

మూగిది కాదు,

సర్వాంగసుందరమైన తొలి యవ్వనపు జవ్వని.

కానీ...

ఆమె ఒక నిర్భాగ్యురాలు!

ఆమెపేరు అబల, కానీ అశక్తురాలు కాదు!

యదార్థానికి ముష్టెత్తుకొనేటందు కామె అయోగ్యురాలు!

కానీ...ఓ దీనదయాళుడు ముష్టెత్తుకొనేటందు కామె కిచ్చాడొక యోగ్యతాపత్రం!—సుమారు నూరు పైచిలుకు కరపత్రా లామె చేతిలో ఉన్నాయి! కంపార్టుమెంటులోఉన్న ప్రతిఒక్కరికీ ఒకొక్క కరపత్రం యిచ్చింది. ఇంగ్లీషు, హిందీ, తెలుగు, అరవభాషల్లో ఆమె కరుణామయజీవితగాథ సంక్షిప్తంగా ముద్రించబడింది.

—ఆమె తూర్పుపాకిస్తానులో గౌరవనీయమైన ఓ బెంగాలీ బ్రాహ్మణకుటుంబంలో జన్మించిందట! మతకల

హోల మారణహోమంలో ఆమె ఆత్మీయులందరూ నిహతులైనారట. ఇంచుమించు యిరవై వేల రూపాయిల విలువగల ఆస్తిని ఆ నరరూప రాక్షసుల కర్పించి, ఎలాగో ప్రాణాలతో భారతమాతగర్భంలో ప్రవేశించగలిగిందట! — ఇన్ని హృదయవిదారకమైన కష్టాల కామె గురికావడంవల్ల ముష్టెత్తుకునేటందు కామెకు తగిన యోగ్యత సిద్ధించిందనే ఉద్దేశ్యంతో...ఓ ప్రముఖ దీనదయాళుడు, ఆమె ముష్టెత్తుకోడాని కర్హురాలనీ, తగినవిధంగా ధర్మం చేయుమనీ మనవి చేస్తూ ఆమెకో యోగ్యతాపత్రంలాంటిది తనవంతు సహాయ్యంగా ప్రసాదించేడు. ఓ బహుభాషాన్వితుని కృపతో అది మూడు భాషలలోకి ముచ్చటగా తర్జుమా అయి... అచ్చాఫీసుకుపోయి ముష్టి పేపర్లుగా ముద్రించబడింది!

ఆ కంపార్టుమెంటులో 'లోవర్ బెర్తు'పై సుమారు ఆరడుగుల పొడవుగల స్థలమంతటినీ బెడ్డింగ్ సహాయంతో ఆక్రమించి, తనదిగా చేసుకున్న ఓ మీసాలపెద్దమనిషి అబల యిచ్చిన కరపత్రాన్ని ఓపిగ్గా చదివి, సాలోచనగా సులోచనాల్లోంచి పరీక్షగా ఆమె ముఖంకేసి చూసి "నీదే వూరు"అని అడిగేడు.

ఆమె తనకు తెలుగు రాదనీ, హిందీ, బెంగాలు భాషలు వచ్చనీ హిందీలోనే చెప్పింది.

"ఆమెకు తెలుగురాదట!" అని మీసాలాయనకు తెలియజేశాడు కాస్త హిందీవచ్చిన ఓ శాస్త్రి.

ఆ మీసాలాయనకు తెలుగుతప్ప మరోభాష రాదు. తన చుట్టూ ఉన్నవాళ్ళ వేపు అదోలాచూసి—"చూశారూ;

ఇలాంటివాళ్ళను నమ్మకూడదు. ఇటువంటివాళ్ళను నేను చాలామందిని చూశాను. పట్టి కులటలు!" అన్నాడు.

యౌవనంలో ఉన్న ఓ కాలేజీ విద్యార్థి ముఖం తుడుచుకొని, క్రాపింగు దువ్వుకుంటూ—"నిజం చెప్పేరు. అసలీమె ముఖ్యవృత్తి యాచనావృత్తి కాదు. కేవలం ఇది ఉపవృత్తి మాత్రమే!—ఇటువంటివాళ్ళకి ముఖ్యవృత్తి వేరే యింకోటుంది!" అన్నాడు.

ఆ విద్యార్థి ప్రక్కనే కూర్చున్నాడో యువకుడు, అతని పేరు కృష్ణమూర్తి. అతనికీ ధోరణి ఏఁపీ నచ్చలేదు. కాలేజీ విద్యార్థి వేపూ, మీసాలబాబు వేపూ, తీక్షణంగాచూసి - "అమ్మాయి ముఖ్యవృత్తేమిటో తమకు తెలుసా?" అని అడిగేడు.

ఆ విద్యార్థి వెకిలిగానవ్వి..."ముష్టిముండ జార్జెట్ చీర కట్టిందంటే ఏఁవనుకోవాలి?" అన్నాడు.

"ఏ తల్లో కనికరించి ఆమెకా చీర యిచ్చుంటుందని ఎందుకనుకోగూడదు ? ఎదుటివాళ్ళను గురించి 'టపీ' మని నీచంగా మాట్లాడం మంచిదని కాదు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏవిఁటి సంగతి?—ఈ ముష్టిముండను వెనకేసుకొస్తున్నారు!—ఆమెకీ తమకీ..."

"కాస్త మర్యాదగా మాట్లాడం నేర్చుకోండి!" కాలేజీవిద్యార్థి వేపు కోపంగాచూసి అన్నాడు కృష్ణమూర్తి.

ఆ కంపార్టుమెంటులో వాళ్ళకి మంచి వినోద కార్య

క్రమం ఏర్పడింది! అందరిదృష్టి కేంద్రీకరింపబడింది! అయోమయంగా అబల అటుకేసి చూసింది!

అబలకు తెలుగురాదు గనుక అక్కడ నిలబడగలిగింది! ఒక్కొక్కరూ తమ అమోఘమైన అభిప్రాయాలు వెలిబుచ్చేరు!

—"ఈ పేపరులో అచ్చుకొట్టించిన విషయమంతా శుద్ధ అబద్ధం."

..."ఈమె పాకిస్థాన్‌నుంచి వచ్చినదై వుండదు. మన దేశంలోనిదే అయివుంటుంది!"

..."ఇదసలు బెంగాలీ బ్రాహ్మణపిల్ల కాదు. ఒట్టి సానిముండ!"

..."ధనవంతుల కుటుంబంలోని పిల్లయితే యిలా సిగ్గూ బిడియం విడిచి ముస్తైతుకోలేదు!"

..."దేశాలమ్మట ఒంటరిగా తిరిగే ఆడది అసాధ్యురాలు!"

"ఇది హత్యలు చెయ్యడానికైనా వెనుకంజ వెయ్యదు!"

"ఇలాంటివాళ్ళే దొంగతనా లెక్కువగా చేస్తూంటారు!"

"రోగాల ఉత్పత్తికి ఇలాంటి వెధవలే కారణం!"

"నానాటికి దేశం పాడయి పోతూంది!"

"కలికాలం బాబూ! కలికాలం!"

—ఈ రకంగా చాలా జోరుగా సాగిపోతున్నాయి విమర్శలు!—కృష్ణమూర్తి మరి భరించలేకపోయాడు. ఆ

అమ్మాయిని దగ్గరకు పిల్చేడు. "నీ పేరేఁవిటమ్మా!" అనడిగేడు బెంగాలీలో.

"అబల" అని సమాధానమిచ్చిం దామె.

"నీలాంటి శరణాగతులకు ప్రభుత్వం శరణాలయాలను నిర్మించిందని నీకు తెలుసా?" అనడిగేడు.

"తెలుసు" అని సమాధానమిచ్చింది అబల.

"అయితే మరి నువ్వు ఏదో ఓ శరణాలయంలో ఉండక, ఇలా దేశాలమ్మట ముష్టెత్తుకుంటూ ఎన్నో అవమానాలను సహిస్తూ తిరుగుతున్నావేం?"

"కొన్నాళ్ళు ప్రభుత్వశరణాలయంలోనే ఉన్నాను."

"అయితే,మరి-ఎంచేతిలా బయటకొచ్చేసి ముష్టెత్తుకుంటున్నావు?"

"మొగదక్షతలేని యౌవనంలోఉన్న ఆడదాన్ని గనక అక్కడి శరణాలయంలో ఉన్న ప్రభుత్వాధికారులకి నామీద అపరిమితమైన ప్రేమ ఏర్పడింది!...వాళ్ళ అపారమైన ప్రేమను భరించలేక బయటికొచ్చేశాను" అంది అబల ఓ బరువైన నిట్టూర్పు విడుస్తూ.

ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి అబలతో బెంగాలీభాషలో మాట్లాడడం వల్ల ఏవిఁటి మాట్లాడేడో బోధపడక, 'కంపార్టుమెంటు'లోనున్న వాళ్ళలో చాలామంది చాలానీచంగా అర్థంచేసుకున్నారా సంభాషణను.

"ఈ రకంగా ముష్టెత్తుకోడం నీ మట్టుకి సుఖంగానే ఉంటుందనుకుంటాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమీ సుఖంగాలేదు. చాలా బాధగావుంది. ఎంతో అవమానకరంగా వుంది! దినదినగండంగా వుంది బ్రతుకు" అంది అబల.

"నువ్వేమీ చదువుకోలేదా?"

"నా మాతృభాష చదవడం వ్రాయడం వచ్చు. అంతే!"

"కూలిపని చెయ్యగలవా?"

"ఇదివరలో చెయ్యలేదు. ప్రయత్నించి చూడాలి!"

"ముష్టెత్తుకోడంకంటే సులభమైన పని నీకు లభ్యమైతే చెయ్యడానికేమైనా అభ్యంతరం వుంటుందా?"

"ఏమీ అభ్యంతరం లేదు."

"అయితే నాతో రా. నీకో చిన్న ఉద్యోగం ఇప్పిస్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

ఆమె మౌనంగా నిలబడింది!

ఇంతట్లో కృష్ణమూర్తి దిగవలసిన స్టేషన్‌లో రైలాగింది. సంచి చేత్తో పట్టుకొని దిగుతూ—"ఇష్టమైతే నాతో రా!" అని అబలకేసి చూసి అన్నాడు కృష్ణమూర్తి.

అబల మౌనంగా అతన్ని అనుసరించింది!

'కంపార్టుమెంటు'లో పకపకలూ, వికవికలూ బయలుదేరాయి! "బేరం కుదిరింది కాబోలు!" అని హుషారుగా అనేసి పకపకమని నవ్వేడు కాలేజీవిద్యార్థి!

"ఇటువంటి వెధవలను చాలామందిని ఎరుగుదును!" అన్నాడు బుగ్గమీసాల ఆసామి మీసాలు మెలివేస్తూ.

రైలు బయలుదేరింది. రైలుఘోషలో ఆ విమర్శల ఘోష కలిసిపోయింది!

♦ ♦ ♦

కృష్ణమూర్తి అతని మిత్రుడైన రంగారావుని కలిసేడు. ఒక పెద్ద మాంగనీసుగని మేనేజరు రంగారావు.

తను వచ్చినపని తెలియజేశాడు కృష్ణమూర్తి!... అబలకు పని దొరికింది. కష్టమైన పనికాదు. ఆడకూలీలచేత పనిచేయించడం ఆమె పని!—నెలకు నలభై రూపాయల జీతం! ఫరవాలేదు. ఒక మనిషి గౌరవంగా బ్రతకడానికి ఈ డబ్బు చాలు!

గౌరవనీయులుండే ఓ వీధిలో ఓ చిన్నయిల్లు అద్దెకు తీసుకొని, కావలసిన అత్యావసరసామగ్రిని కొని ఆమె కిచ్చి గౌరవంగా కాలక్షేపం చెయ్యమని చెప్పి "ఇక నే వెళతాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇదంతా మీరుపెట్టిన భిక్ష!—ఈ భిక్షకురాలి చేతిభోజనం మీకు సహిస్తే చాలా సంతోషం. ఈ ఒక్క పూటా మీ రిక్కడ భోజనం—..."

"మరొకప్పుడు వచ్చి తప్పకుండా భోంచేస్తాను. ఇక్కడికి యిరవైమైళ్ళదూరంలోనున్న ఓ గ్రామానికి నేను అర్జంటుగా వెళ్ళాలి. ఈ ఉదయానికే అక్కడికి కొస్తానని చెప్పాను. ఇప్పటికే చాలా ఆలస్యమైంది!—వారం పది రోజులలో మళ్ళీ వస్తాను!" అన్నాడు కృష్ణమూర్తి.

మనస్ఫూర్తిగా నమస్కరించింది అబల.

అబలనుగురించి ఆలోచిస్తూ వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

అంతవరకూ కలగని అనుమానం అకస్మాత్తుగా అబలమీద కలిగింది కృష్ణమూర్తికి!...నిజంగా అబల సత్ప్రవర్తన కలదేనా? అని అతని అనుమానం!

ఆమె సచ్ఛీల అని అతడు నిశ్చయించుకోడానికి తగిన సాక్ష్యమేదీ లేదు. ఆమెముఖం చూసిన వెంటనే ఆమెపట్ల తనకి మంచిభావ మేర్పడింది! అంతమాత్రంలో ఆమె శీలవతని అనుకోడం ఎలా?

ఆమె ముఖంలో అమాయకత్వం, దీనత్వం ఉట్టిపడు తున్నాయి!

కానీ...

గోముఖ వ్యాఘ్రాలూ...

మేకవన్నె పులులూ...

ఈ మనుష్యులలో లేకపోలేదు!...

అబల ముఖంలో ప్రసన్నతుంది! గంభీరతుంది! ...కానీ ఆమె హృదయం నిర్మలమైనదేనా అని?—కృష్ణమూర్తి ఆలోచనలు పరిపరివిధాలపోయాయి!

—అబల నిజంగా పాకిస్తానునుండి వచ్చినదేనా?—ఆత్మీయులందరూ ఆ నరరూపరాక్షసుల కరకుకత్తికి బలి అయినప్పుడు ఈమెఒక్కర్తీ ఎలా తప్పించుకు రాగలిగింది? —పోనీ ప్రాణాలమీది తీపిచే, మొండి ధైర్యంతో భగవత్ కృపవల్ల ఎలాగో ఓలా తప్పించుకొని రాగలిగిందనుకో వచ్చు!— కానీ ఒంటరిగా దేశాలమ్మట ముష్టెత్తుకోడానికి

తిరుగుతూన్న అబల లౌకికమైన విషయాలకూ, ఇంద్రియ సౌఖ్యాలకూ లోనుకాకుండా పవిత్రంగా బ్రతగ్గలిగే అవకాశం వుందా?— ఒంటరిగా తిరిగే అందమైన ఆడదానికి మన దేశంలో రక్షణుందా?—కృష్ణమూర్తి మనస్సు ఉద్రిక్తమైంది!—

ట్రైనులో చాలామంది చాలానీచంగా అబలను గురించి మాట్లాడినప్పుడు, వాళ్ళందరిమీాదా చాలాకోపం వచ్చింది కృష్ణమూర్తికి. తీరా ఆమెను వెనకేసుకొచ్చి, ఆమె భవిష్యత్ జీవితానికి గౌరవప్రదమైన మార్గం చూపించిన అనంతరం ఆమె శీలాన్ని శంకించడం మొదలెట్టేడు కృష్ణమూర్తి.

ఆ కంపార్టుమెంటులో ఆమెను చూసిన వెంటనే ఆమె అపవిత్రమైనదై ఉంటుందని అనుమానించేరు చాలామంది!– కానీ తనో?— అలా ఆమెను అనుమానించడానికి చాలా ఆలస్యం ఎందుకైందో అని కృష్ణమూర్తి ఆలోచన!...

— తను రమ్మనిన వెంటనే తనతో వచ్చేసింది ఏ సంకోచమూ లేకుండా!— ముక్కూ ముఖమూ యెరుగని ఓ పరాయి మగవాడు పిలచిన వెంటనే అతని వెంటబడే ఆడదాన్ని శీలవతిని అనుకోడం ఎలాగ?— పోనీ లోకం పోకడ తెలీని అమాయకురాలని అనుకోడానికి వీల్లేదు! ఒంటరిగా దేశదేశాలన్నీ తిరుగుతూ ముష్టెత్తుకునే ఆడదానికి కావలసినంత లోకానుభవం వుంటుంది!... లోకం పోకడ తెలిసిన అబల తను పిలచిన వెంటనే ఏ సంకోచం లేకుండా తన వెంటపడింది! తను తగు మనిషి అవునో కాదో ఆమెకప్ప

టికి తెలీదు! తన మనస్సులో ఎటువంటి భావం ఉందో ఆమెకి తెలీదు! అలాంటప్పుడు ఏ సంకోచంలేకుండా ఆమె తనతో వచ్చేయడంవల్ల ఆమె శీలాన్ని శంకించడంలో పొర పాటు లేదనుకున్నాడు కృష్ణమూర్తి. ఇంక ఆమె ఎటువంటిదో ఎలాగూ మరికొంతకాలానికి బయటపడుతుంది గనక ఇంకా మెనుగూర్చి యెక్కువగా ఆలోచించకూడదనుకున్నాడు. దారిలో రంగారావుని కలుసుకొని— "అబల ప్రవర్తన ఓ కంట కనిపెడుతూండ"మని చెప్పి బస్సుస్టాండు వేపు వెళ్ళి పోయాడు కృష్ణమూర్తి.

రంగారావు తన రెండుకళ్ళతోనూ అబల ప్రవర్త నను కనిపెట్టడానికి పూనుకున్నాడు! అతనికళ్ళ కామె బాగా నచ్చింది.

ఆమె ప్రవర్తనను కనిపెట్టడానికి పూనుకున్న రంగా రావు తను ఎలా ప్రవర్తించాలో విస్మరించేడు! తనో పెద్ద గని మేనేజరై వుండీకూడా ఒంటరిగా ఉన్న అబల గృహం ఎక్కడుందో భోగట్టా చేసి మరీ ఆమె యింటికి వెళితే లోకులేం అనుకుంటారో గ్రహించలేనంతటి తెలివితక్కువవాడు కాడు రంగారావు! సౌందర్యవతియైన అబలను చూశాక ఆ తెగింపు వచ్చిం దతనిలో.

రంగారావుగారు తనింటిముందు ఆగడం చూసి, విభ్రాంతురాలైంది అబల!...నిర్లిప్తురాలై నమస్కరించింది!

ఆ రోజు నేఉతికినచీరెను నేలమీదపరచికూర్చోమంది.

"ఇప్పుడు కూర్చోడానికి రాలేదు. నాకవతల చాలా పనుంది. నీ కిక్కడ సౌఖ్యంగా ఉందో లేదో చూసిపోడానికి వచ్చేను. ఈ యిల్లు పాడుపడినట్లుంది. నేలంతా తేమగా

ఉంది. చీకటిగా కూడా వుంది. ఇందులో ఉంటే నీ ఆరోగ్యం పాడయిపోతుంది." అన్నాడు రంగారావు హిందీలో.

"ఒకప్పుడు మంచి భవంతిలో ఉండేదాన్ని?...అటు తరువాత కొంతకాలం ఎండకీ, వానకీ, చలికీ నా యీ శరీరాన్ని అర్పించేను. ప్రస్తుతం తలదాచుకోడానికిమాత్రం సలమైనా దొరికింది! మొండిదేరిన నా యీ శరీరానికీమాత్రం నీడ చాలు?" అని తలవంచుకొని అంది అబల.

"నా బంగళాకు దగ్గరగా ముఖ్యమైన పనివాళ్లకోసం కట్టించిన యిళ్ళు కొన్నిఉన్నాయి. ఎవడో ఒకడిచేత ఖాళీ చేయించి నీకిస్తాను. అక్కడికి నువ్వొచ్చేస్తే నీకన్నివిధాలా సదుపాయంగా వుంటుంది."

"ఈ అభాగ్యురాలికి సదుపాయం చెయ్యాలని అక్కణ్ణించొకణ్ని తగిలేయకండి. నాగురించి ఎవర్నీ బాధపెట్టకండి. నాపట్ల తమ కభిమానం వుంటే నాకదే చాలు?"

రంగారావు కొంచెంసేపాలోచించి అన్నాడు... "పోనీ ఎవ్వరికీ కష్టంకలగని ఏర్పాటు మరోటి చేస్తాను! నా బంగళా చాలా పెద్దది. విశాలమైనది. వెనకాల రెండు గదులు పనికిరాని చెత్తసామానుతో నిండివున్నాయి. ఆ గదులలో ఒకటి ఖాళీచేస్తాను. అందులో ఉండడానికి నీ కభ్యంతరం ఉండదనుకుంటాను."

"కృష్ణమూర్తిగారి నీ విషయం అడిగి వారెలా చెబితే ఆలా నడుచుకుంటాను."

"ఈ విషయంలో వాడి నడిగి చెయ్యవలసిందేమీ లేదు. అసలు కృష్ణమూర్తే చెప్పేడు నీకన్నిసదుపాయాలూ సమకూర్చమని."

"వారిమాటప్రకారమే మీరు నాకీ సదుపాయాలన్నీ సమకూరుస్తున్నట్లయితే నాకే అభ్యంతరమూ వుండదు." అంది అబల.

"సరే! రేపే ఆగది ఖాళీచేయించి నీకు కబురుచేస్తాను. వచ్చేసేయి! ఇక నే వెళ్ళనా?" అంటూ రంగారావు వెను తిరుగుతూంటే...

"ఒక్క నిమిషం ఆగండి. కాఫీ తాగి..." అని అబల అంటూవుండగానే... రంగారావు చిరునవ్వు నవ్వి... "అక్కర్లేదు. ఆ శ్రమ నువ్వు పడొద్దు"అని అంటూ వెళ్ళి పోయాడు.

♦ ♦ ♦

తన బంగళా ఆవరణలోకి అబల వచ్చేసినతరువాత రంగారావుకి ఓవిచిత్రమైనఅనుమానంకలిగింది!...అబలకూ, కృష్ణమూర్తికీ ఏమైనా నీచమైన సంబంధం వుందేమోనని అతని అనుమానం.

అబలమీద కృష్ణమూర్తికి అంత ప్రేమకలగడానికి కారణం ఏమిటి?... లోకంలో ఎంతమంది ముష్టివాళ్ళు లేరు?... ఎవ్వరిమీదాకలగని అభిమానం అబలమీద కలగడానికి కారణం ఏమైవుంటుంది?... అబల సౌందర్యవతి అవబట్టే ఆరకం ప్రేమ ఆమెమీద కృష్ణమూర్తికి కలిగిందని ఎందుకనుకోగూడదు?

ఏమో? ... పాడుబుద్ధి, మనిషికే సందర్భంలో నైనా జనించవచ్చు! బ్రహ్మచారి, మంచి యౌవనంలో ఉన్నాడు. శారీరకోద్రేకాలకు సంబంధించిన కోర్కెలతనికి ఉండడంలో అసహజత్వం ఏమీలేదు. రాజకీయపార్టీల్లో తల

దూర్చి ఒకదగ్గర స్థిరంగా ఉండకుండా తిరుగుతూండే కృష్ణ మూర్తికి ప్రత్యేకించి ఓ సంసారం అనవసరం! అందుకనే యింతవరకూ అతను వివాహం చేసుకోలేదు. కానీ అతనికీ శారీరక మానసికో[ద్రే]కాలుండడం సహజం!...అందుకనే కృష్ణమూర్తి అబలను చేరదీసేడేమోనని రంగారా వనుమానించాడు!

ఆఖరికి అబలజీవితం అందరికీ అనుమానాస్పదమైన దిగా మారిపోయింది!

*　　*　　*

రంగారావుభార్య అబలను ఆడిపొయ్యని రోజులేదు! ...ఆమెకు హిందీగానీ, బెంగాలీగానీ రాకపోవడంచేత తెలుగులోనే తెగ శాపనార్థాలు పెడుతూండేది! ఆమె ఎందుకలా తనవేపుచూసి అరుస్తున్నదో అబలకు అర్థం కాలేదు!

అబల గుణం ఎటువంటిదో పరిశీలించి తన కను గుణంగా వుంటే అనుభవిద్దామని, రంగారావు రోజూ అబలను కలుసుకొని పలకరిస్తూవుండేవాడు.

ఒకనాడు అబల రంగారావుని చాలా అమాయకంగా అడిగింది—"అమ్మగారు రోజూ నన్నుచూసి కేకలేస్తున్నారు. ఆ కేకలకు అర్థమేఁవిటండీ?" అని.

"అబ్బే!...ఆ కేకలకు అర్థం యేమీలేదు! ఆమె ఒట్టి పిచ్చిది" అనేశాడు రంగారావు.

"ఆమె పిచ్చావిడలాగ లేదే!"

"ఉన్మాదాలు అనేకరకాలు. వాటిలో ఇదోరకం ఉన్మాదం!" అన్నాడు నవుగుతూ.

నిజమే అనుకుంది అబల!

ఆమె పిచ్చికేకలకు తనే కారణమని తెలీదు అబలకు.

వారం పదిరోజులలో వస్తానన్న కృష్ణమూర్తి నెల రోజులయేక ఆ ఊరు వచ్చేడు. అబల తను కుదిర్చినయింట్లో లేకపోయేసరికి ఆశ్చర్యపోయేడు. వెంటనే రంగారావింటికి వెళ్ళాడు అబల యేమైనదీ తెలుసుకుందామని!

"ఓ కంట కనిపెడుతూండమన్నావుకదూ; అందుకని ఆమెబస నా బంగళా ఆవరణలోకే మార్చేశాను" అన్నాడు రంగారావు.

"సరే మంచిపనే చేశావు. ఇంతకీ ఆమెప్రవర్త నెలా వుంది?" అనడిగేడు.

"మంచిదానిలాగే అగుపిస్తున్నది" అని ముక్తసరిగా సమాధానమిచ్చాడు. ఏవో ఇతరవిషయాలనుగురించి, ఆ ఉభయులూ మాట్లాడుకున్నారు కొంతసేపు. ఆ తరువాత కృష్ణమూర్తి అబలవుంటూన్న గదిదగ్గరి కొచ్చాడు.

కృష్ణమూర్తిని చూసి పరమానందభరితురాలైంది. అబల మనస్ఫూర్తిగా నమస్కరించింది. తెల్లటిదుప్పటి మంచంమీదపరచి కూర్చోమంది.

మంచంమీద కూర్చుంటూ "ఎలాగుంది? సౌఖ్యంగా వుందా?" అని అడిగేడు.

"మీ దయవల్ల సుఖంగానేవుంది. ఔనుగానీ, వారం పదిరోజుల్లో వస్తామన్నారు. ఇన్నాళ్ళయిందేవిటి?" అని అడిగింది అబల.

"కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించే ఏర్పాటుచెయ్యడంకోసం ఢిల్లీ వెళ్ళి పార్లమెంటు 'మెంబ

డ్స'ని కలుసుకోవాల్సివచ్చింది. వెళ్లొచ్చాను. అందుకే ఆలస్యమైంది" అన్నాడు.

"ఈ అభాగినిని జ్ఞాపకం ఉంచుకొని చూడ్డానికొచ్చారు. అంతేచాలు! పోనీ ఈనాడైనా ఈ అభాగ్యురాలి యింట్లో భోంచేస్తారా?" కృష్ణమూర్తి కళ్ళలోకి సూటిగాచూస్తూ అడిగింది అబల.

"నా అభ్యంతరమేమీ లేదు. కాని రంగారావు ఒప్పుకుంటాడా అని?"

"ఏం?...ఎందు కొప్పుకోరు?"

"వాడింటికొచ్చేక వాడింట్లో భోంచెయ్యకపోతే సామాన్యంగా ఊరుకునేమనిషికాడు వాడు!...నా రాక వాడిభార్యకుకూడా తెలిసింది. నీ యింట్లో నేను భోంచేశానూ అంటే ఆవిడ మరోరకంగా అపార్థం చేసుకుంటుంది; అందువల్ల నీకే నష్టం."

"పాపం!...ఆవిడపిచ్చిదటగా!—పిచ్చివాళ్ళు ఏఁవనుకుంటేనేం ?"

చాలా ఆశ్చర్యపోయేడు కృష్ణమూర్తి. "ఆవిడ పిచ్చిదని నీ కెవరు చెప్పేరు?" అనడిగేడు.

"ఎవరేఁవిటీ?... మేనేజరుగారే!"

"ఏఁవిటీ?...రంగారావే చెప్పేడా అలాగని?"

"ఔను. ఏం—అంత ఆశ్చర్యంతో అడుగుతున్నారు?—ఆవిడకు పిచ్చని మీకు తెలీదా?"

"ఈమధ్య పిచ్చెత్తిందేమో మరి!—కనుక్కొని వస్తా" అని లేచి నిలుచున్నాడు.

"మరి మీ భోజనం—"

"ఇక్కడే చేస్తాను. అన్నీ సిద్ధంచేయించు" అని వెళ్ళి పోయాడు.

కృష్ణమూర్తి తనయింట్లో భోజనం చెయ్యడాని కొప్పుకున్నందుకు చాలా సంతోషించింది అబల! ఉన్నవాటితో సంతృప్తికరంగా అతని కానాడు భోజనం పెట్టాలనుకుంది!

*  *  *

రంగారావుభార్య కృష్ణమూర్తికి చాలావిషయాలు చెప్పింది!—తనభర్త అబలవలలో పడ్డాడనీ, ప్రొద్దస్తమానం ఆమె ధ్యాసలోనే ఉంటున్నాడనీ, అబలప్రవర్తన ఏఁవీ బాగులేదనీ, రోజురోజుకీ తనపరిస్థితి ఆ యింట్లో చాలా అవమానకరంగా ఉంటున్నదనీ, అబల యింకా ఆ ఊళ్లోవుంటే ఏనుయ్యోగొయ్యో చూసుకొని చావడంతప్పిస్తే తనకు మరోమార్గం లేదనీ, దాన్ని తగిలేసేఏర్పాటు చెయ్యమనీ కృష్ణమూర్తిముందు ఏడ్చిందా యిల్లాలు!

కొంతమంది పనివాళ్ళుకూడా అబలవలలో రంగారావు పడ్డట్టు రహస్యంగా కృష్ణమూర్తికి చెప్పేరు.

అతని తల తిరిగింది—వెంటనే రంగారావు దగ్గరికెళ్ళి—"ఏఁవిఁటిదంతా?—నిజమేనా?" అని అడిగేడు.

రంగారావు చాలా గాభరాపడి నసుగుతూఅన్నాడు—"అబల నీదిగా!—నీ కన్యాయం చెయ్యడానికి నే నెందుకు తలపెడతాను చెప్పు? ఆమెను నా చెల్లెలితో సమానంగా చూస్తున్నాను."

కృష్ణమూర్తి మరేమీ మాట్లాడలేకపోయాడు. అతని ముఖం జేవురించింది!—చాలా విసురుగా అబలదగ్గరకొచ్చి ..."నీ ముఖంచూసి చాలా పొరబడ్డాను! పచ్చని కాపు

రంలో చిచ్చుపెట్టడం మంచిదికాదు. నీవల్లే ఆ యిల్లాలు పిచ్చిదయిందని తెలుసుకున్నాను. ఆమె ఉసురు నీకు తగిలక పోదులే!—భగవంతుడు నీ కిచ్చిన అందంతో మనుష్యుల జీవితాలతో చెలగాటమాడటం మంచిపని కాదు! నీ యీ నీచమైన విలాసానికి రంగారావే దొరికేడా?... ఇలా నీచంగా బ్రతకడంకోసమేనా ప్రాణాలను దక్కించుకొని ఈ పవిత్రమైన దేశానికి పారిపోయొచ్చావు?" అని ఆమె కేసి తీవ్రంగాచూసి అనేసి గిరుక్కున వెనక్కుతిరిగి వెళ్ళిపోయేడు కృష్ణమూర్తి.

అబల కొయ్యప్రతిమలా నిలబడిపోయింది!—వెయ్యి పిడుగులు ఒక్కమాటు మీదపడినట్టు క్రుంగిపోయింది!... ఆ కింకరులు తన ఆత్మీయులనందరినీచంపి, సర్వస్వాన్నీ దోచుకున్నాడుకూడా ఆమెకు ప్రాణాలమీద తీపి పోలేదు.

కానీ కృష్ణమూర్తి అలా కఠోరంగా మాట్లాడినప్పుడు ఇంకా తనెందుకుజీవించుచుండడమని తనలో తాను ప్రశ్నించుకుంది!

ఆ భయంకరమైన తుఫానులో అబల ఎటు వెళ్ళిపోయిందో ఎవ్వరికి తెలీదు!

కృష్ణమూర్తి కోసమని వండిన వంటసామానులన్నీ ఆ గదిలో అలాగేఉన్నాయి! వాటన్నింటినీ పెంటమీద పారబోసింది రంగారావు భార్య!—పీడ విరగడయిందనుకుంది!—

కాని అబలవంటి స్త్రీలు అపవిత్రులుగానే అంత మొందుతున్నారు!

పాపం!...అబల చరిత్రహీనురాలు!!

---